క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఏపీ అనురాధ

దత్తిరాజేరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఏఓ అనురాధ అన్నారు.స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ప్రకృతివ్యవసాయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, ప్రకృతి వ్యవసాయం గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రసాయన ఎరువులు, మందులతో భూమికి కలిగే నష్టం, ఆ పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించాలన్నారు. వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌లో తనిఖీలు



మార్ట్‌లో శనగ పప్పును పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నాగులమీరా

శృంగవరపుకోట: స్థానిక రిలయన్స్ మార్ట్‌లో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నాగులమీరా బుధవారం సాయంత్రం తనిఖీలు చేశారు. మార్ట్‌లో ఉన్న పచ్చి శనగపప్పు శాంపిల్స్ సేకరించారు. వాటిని సీల్ చేసి, హైదరాబాద్‌లోని నాచారంలో ఉన్న ల్యాబ్‌కు పంపుతున్నామని ఆయన చెప్పారు.సాధారణ తనిఖీల్లో భాగంగానే మార్ట్‌ను పరిశీలించామని, పచ్చిశనగ పప్పు కు కలర్ పాలిష్ చేశారన్న అనుమానంతోనే శాంపిల్స్ సేకరించామని, ల్యాబ్ రిపోర్టులు అందిన తర్వాత జిల్లా అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పదోతరగతి పరీక్షల పరిశీలన



వేపాడ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

వేపాడ: మండల కేంద్రంలో పదో తరగతి పరీక్షల నిర్వహణను తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, ఎంఈఓ బాలభాస్కరరావు బుధవారం పరిశీలించారు. వేపాడ ఉన్నత పాఠశాలతో పాటు విక్టరీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరుతో పాటు కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. మండలంలో మూడు కేంద్రాల్లో 412 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా బుధవారం 411 మంది హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

బడ్జెట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షుడు సూర్యారావు

శృంగవరపుకోట: ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఓటరు అక్షరా స్యత వేదిక అధ్యక్షుడు డి.సూర్యారావు అన్నారు. పట్టణం లోని శాఖా గ్రంథాలయంలో పాఠకులకు బడ్జెట్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడుతున్న బడ్జె ట్‌లే ప్రజలకు తెలుస్తున్నాయని, మండల పరిషత్ లు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, పంచాయ తీల బడ్జెట్‌లు సామాన్య ప్రజలకు తెలియడం లేదన్నారు. స్థానిక సంస్థల బడ్జెలు ప్రజలకు తెలిసేలా ఆయా శాఖల మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థలు తమ అభివృద్ధికి ఏం చేస్తున్నాయి, ఎక్కడ ఎంత నిధులు ఖర్చు చేస్తున్నాయన్న విషయాలను ప్రజలు తెలుసుకోవాలని అన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

లక్కవరపుకోట/కొత్తవలస: కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో ప్రవేశాలకు దరఖా స్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయా కేజీబీవీల ఎస్ఓలు ప్రవీణ, విజయలక్ష్మి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీ డియట్ ప్రథమ సంవత్సరాల్లో ప్రవేశాలకు, 7,8,9,10వ తరగతుల్లో, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 22వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పేద ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన, అనాథ బాలి కలు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు 70751 59996, 70750 39990 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేతనదారుల ఎదురు చూపులు..!

గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన ఎస్.వెంకయ్య అనే వేతనదారుడు గత నెల రోజులుగా ఉపాధి పనికి వెళుతున్నాడు. అతనికి ఇంతవరకు వేతనాలు జమ కాలేదు. ఇదే గ్రామానికి చెందిన పి.రమణమ్మ నెల రోజులుగా ఉపాధి పనికి వెళుతోంది. ఈమెకు కూడ ఇంతవరకు వేతనాలు జమకాలేదు. ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. వేలాది మందికి వేతనాలు జమకాలేదు.



పెదమజ్జిపాలేంలో పనులు చేస్తున్న వేతనదారులు

- రెండు నెలలుగా అందని ఉపాధివేతనాలు
- గంట్యాడ మండలంలో బకాయిలు దాదాపు రూ.2 కోట్లు

గంట్యాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో పనిచేసే వేతనదారులకు రెండునెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వేతనాలమీదే ఆధారపడే వారు తీవ్ర అవస్థలు పడుతు న్నారు. ప్రభుత్వం ఎప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు జమచేస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వేలాది మందికి లక్షలాది రూపాయలు వేతనాలు రావాల్సి ఉంది. గతంలో పనిచేసిన వారానికే వేతనాలు జమయ్యేవి. కానీ నేడు ఆపరిస్థితి లేదు.

సుమారు లక్ష పనిదినాల వేతనం పెండింగ్

మండలంలో సుమారు లక్ష పనిదినాలకు సంబంధించి సుమారు రూ. 2కోట్ల వరకు నిధులు వేతనదారులకు రావాల్సి ఉంది. ఈఏడాది జనవరి 16వ తేదీ నుంచి వేతనాలు చెల్లించలేదు. ఉపాధి పనులకు పేద, మధ్యతరగతి ప్రజలే వెళు తుంటారు. వీరిలో చాలా మంది ఉపాధి హామీ వేతనం ద్వారానే జీవనం సాగిస్తారు. వాటితోనే బియ్యం, నూనె, పప్పులు వంటి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకుంటుంటారు. రెండు నెలలుగా ఉపాధి పనులు తప్ప వేరే కూలిపనులకు వెళ్లకపోవడం, చేతిలో చిల్లిగవ్వలేక పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. మండు టెండల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు చెల్లించే విషయంలో ప్రభుత్వం ఎందుకు కాలయాపన చేస్తోందని వ్యవసాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

రూ.2 కోట్లు రావాల్సి ఉంది

మండలంలో ఉపాధి వేతనదారులకు సంబంధించి సుమారు రూ. 2కోట్లు నిధులు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అయిన వెంటనే వేతనదారుల ఖాతాల్లో జమ చేస్తాం.

– జి.సుందరరావు, ఉపాధి హామీ పథకం ఏపీఓ, గంట్యాడ మండలం

నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించండి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రకృతి వ్యవసాయ విధానంలో నవధాన్యాల సాగుపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ వి.శైలజ వీఓఏలకు సూచించారు. గరివిడి మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం.పి.నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా సమాఖ్య సమావేశంలో ప్రకృతివ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్(ప్రకృతి వ్యవసాయ సిబ్బంది), డ్వాక్రా సంఘాల వీఓఏలు, సచివాలయ వీఏఏలు అంతా సమన్వయంతో గ్రామాల్లో రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. నవధాన్యా ల సాగుతో నేల ఏ విధంగా సారవంతమవుతుందో, భూమికి ఏయే పోషకాలు అందుతాయో, ఇతర ప్రయోజనాలను వివరించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏఓ శైలజ

సంఘాలన్నీ ఏ–గ్రేడ్‌లో ఉండాలి

డ్వాక్రా సంఘాలన్నీ ఏ– గ్రేడ్‌లో ఉండాలని ఏపీఎం పి.నారాయణరావు వీఓఏలు, సంఘాల సభ్యులకు సూచించారు.ప్రస్తుతం స్వయం సహాయక సంఘాలను సైంటిఫిక్‌గా గ్రేడింగ్ చేయడం జరుగుతోందని తెలిపారు. నెలవారీ పొదుపు, అంతర్గత, అన్ని రకాల అప్పుల చెల్లింపులు సకాలంలో చేస్తే ఆ సంఘం ఏ గ్రేడ్‌లోకి వస్తుందని వివరించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా విద్యాభ్యాసం చేస్తున్న వయోజనులకు ఈనెల 23వ తేదీన గ్రామాల్లోని పాఠశాలల్లో ఎసెస్‌మెంట్ టెస్టు ఉంటుందని, ఈ విషయాన్ని అభ్యాసకులకు తెలియజేయాలని సూచించారు.

మండల పరిషత్ నిధులతో హ్యాండ్ బోర్లు



చీపురుపల్లిరూరల్(గరివిడి): కె.పాలవలసలో బోరు డ్రిల్లింగ్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, తదితరులు



వేపాడ: కృష్ణారాయుడుపేటలో భూమిపూజలో పాల్గొన్న ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కె.పాలవలస గ్రామదేవత వనం వద్ద తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులకు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి వనం వద్ద భక్తుల సౌకర్యార్థం మండల పరిష త్ నిధులు రూ.1.20 లక్షలతో హ్యాండ్ బోరు ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వర రావు, స్థానిక సర్పంచ్ మీసాల ప్రసాదరావు, స్థానిక పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మీసాల లక్ష్మునాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కృష్ణారాయుడుపేటలో..

వేపాడ: కృష్ణారాయుడుపేట గ్రామంలో మండల పరిషత్ నిధులతో హ్యాండ్ బోరు ఏర్పాటు పనులకు ఎంపీపీ సత్యవంతుడు బుధవారం భూమి పూజ చేశారు.ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో నల్లబిల్లి పంచాయతీకి రెండు, వేపాడ పంచాయతీకి రెండు, కృష్ణారాయుడుపేట పంచాయతీకి ఒకటి చొప్పున హ్యాండ్ బోర్లు మంజూరు చేశామని చెప్పారు. సర్పంచ్ బాల బాబు, గ్రామపెద్దలు ఆలబోని పైడిబాబు, బోజంకి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేసేలా చూడండి

బొండపల్లి: అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు 2017–2018లో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన తమకు పోస్టింగ్‌లు ఇచ్చేలా, తమసమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని పలువురు అభ్యర్థులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును కోరారు. మండలంతో పాటు, జిల్లా వ్యాప్తంగా అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు ఎమ్మెల్సీ శ్రీనివాసు లనాయుడును విజయనగరంలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 1,110 మంది అర్హత సాధించారని, ఇంత వరకు పోస్టులను భర్తీ చేయలేదన్నారు. ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూసిన తమకు నిరాశే మిగిలిందని, పరీక్షలు నిర్వహించినప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వమే ఇప్పుడూ ఉందన్నారు. తవ్వా మోహన్, బిరుదు రవికుమార్, వీర భద్ర, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ గాదెకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీపీఎస్సీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హత సాధించిన అభ్యర్థులు

సీతమ్మవారి మంగళసూత్రాలకు బంగారం వితరణ

లక్కవరపుకోట: రంగారాయపురంలోని రామాలయంలో సీతమ్మవారికి మంగళసూత్రాలు తయారీ నిమిత్తం ఆ గ్రామానికి చెందిన గేదెల సీతారాం కుటుంబ సభ్యులు అర తులం బంగారు వితరణ చేశారు. బంగారాన్ని మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. శ్రీరామనవమి నాటికి అమ్మవారికి మంగళసూత్రాలు తయారు చేయించాలని ఆలయకమిటీకి దాతలు సూచించారు.

క్షయరహిత సమాజానికి సహకరించాలి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

లక్కవరపుకోట: క్షయ(టీబీ) రహిత సమాజానికి అంతా సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ కోరారు. జాతీయ క్షయ నిర్మూ లన కార్యక్రమంలో భాగంగా రెల్లిగౌరమ్మపేట సమీపంలోని మహామాయ కర్మాగారంలో కార్మికులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం,ఆకలి మందగిం చడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడడం వంటివి టీబీ లక్షణాలని అన్నారు.ఈలక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా సమీపంలోని పీహెచ్‌సీ లకు వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించా రు. టీబీ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా వ్యాధి ఇతరులకు సోకే అవకాశం ఉందని చెప్పారు. కర్మాగార వైద్య సిబ్బంది, హెచ్ఆర్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా జగదీష్



గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా జెర్రిపోతుల జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలక్షన్ నిర్వహణాధికారి, సీనియర్ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నిక నిర్వహించగా, జగదీష్ ఒక్కరే నామినేషన్ వేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎలక్షన్ నిర్వహణ అధికారి ప్రకటించారు. జగదీష్‌కు బార్‌అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల నిలయం



గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కనీస వసతులు కరువు
- అధ్వానంగా కాంప్లెక్స్ ఆవరణ
- మరుగుదొడ్లకు తాళాలు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఆర్టీసీ కాంప్లెక్స్‌ను 1993 అక్టోబర్ 29న ఏర్పాటు చేశారు.అయితే నేటికీ ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు.రోజూ చుట్టు పక్క గ్రామాల నుంచి వందలాది మంది ఇక్కడి నుంచి ప్రయాణాలు సాగిస్తుంటారు.ప్రయాణికులు గుక్కెడు మంచినీటికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కాంప్లెక్స్‌లో తాగునీటి కుళాయిలు ఉన్నప్పటికీ నీరు పరిశుభ్రంగా ఉండడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. పోనీ వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకుని తాగుదామనుకుంటే కాంప్లెక్స్ ఆవరణలో కనీసం ఒక్క దుకా ణం కూడా లేదు. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంతో ప్రధానంగా స్త్రీలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.నిత్యం ఈకాంప్లెక్స్ మీదుగా సుమారు రోజుకు 150 నుంచి 170 వరకు బస్సులు తిరుగుతూ ఉంటాయి. అయితే కాంప్లెక్స్ వద్ద ప్రయాణికులకు సమాచారం అందించేందుకు కనీసం ఒక్కరంటే ఒక్కరూ కూడా ఆర్టీసీ సిబ్బంది లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని బస్సులు కాంప్లెక్స్ ఆవరణలోకి రాకుండానే వెళ్లిపోతుంటాయి. సమస్యలను ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు సమాచారం అందించేందుకు జగదీష్ అనే వ్యక్తిని నియమించామని, మరుగుదొడ్లకు తాళాలు వేయకూడదని, కాంప్లెక్స్‌లో మౌలిక వసతులు కల్పనకు దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.



తాళం వేసి ఉన్న స్త్రీల మరుగుదొడ్డి



సమాచార కేంద్రంలో సిబ్బంది లేని దృశ్యం

మర్యాదపూర్వక కలయిక

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఉండవల్లిలో ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్, జీసీసీ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



– శృంగవరపుకోట

ఆర్టీసీ ఉద్యోగుల గేటు ధర్నా



ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏపీపీటీడీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఎస్ఎంయూ జోనల్ కమిటీ పిలుపు మేరకు ఎస్.కోట ఆర్టీసీ డిపోలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయం లో ఎస్ఎంయూ నాయకులు, సభ్యులు గేటు ధర్నా చేశారు. విధులకు ఎర్ర బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అనకాపల్లి డిపోలో అక్రమ తొలగింపు లను రద్దు చేయాలని, మహిళా ఉద్యోగులకు నెలకు మూడు రోజులు సెలవులు ఇవ్వాలని,అయిదేళ్లుగా ఒకే క్యాడర్‌లో ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పించాలని, ఆన్‌కాల్, హైర్ డ్రైవర్లకు బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని, ఆన్‌కాల్ డ్రైవర్లకు రోజుకు రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిపో సెక్రటరీ రాజయ్య, అధ్యక్షుడు జి.వి. రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.బి.నాయుడు, కోశాధికారి ఎన్.వి.రమణ,పలువురు కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజ్ కార్మికులు పాల్గొన్నారు.

– శృంగవరపుకోట

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గజపతినగరం అగ్నిమాపక శాఖ అధికారి ఎం.ఎస్.వి. రవిప్రసాద్ సూచించారు. గజపతినగరం మండల కేంద్రంలోని పురిటిపెంట లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రమాదాలు సంభవించేటప్పుడు 101 నంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

– గజపతినగరం

రీసర్వేకు సహకరించండి



దత్తిరాజేరు: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయభాస్కర్, వేదికపై ఆర్డీఓ రామ్మోహన్‌రావు

దత్తిరాజేరు: భూముల రీసర్వేకు రైతులంతా సహకరించాలని బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహన్‌రావు కోరారు. మండలంలోని వింధ్యవాసి గ్రామంలో రీసర్వేపై బుధవారం గ్రామసభతో పాటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతుల సమక్షంలోనే రీసర్వే చేస్తామని, ఈసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. తహసీల్దార్ విజయభాస్కర్ మాట్లాడుతూ వందేళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూరీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే చేస్తామన్నారు. రీసర్వే డీటీ రత్నకుమారి, సర్పంచ్ రంభ చంద్రశేఖర్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

గుర్ల: రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వి.నారాయణమ్మ అన్నారు.రీసర్వే చేపట్టనున్న కోట గండ్రేడు గ్రామంలో సర్వే సిబ్బందితో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల సర్వేయర్ శివ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



గుర్ల: కోటగండ్రేడులో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మానవత్వం చాటారు

శృంగవరపుకోట: తమతో పనిచేస్తున్న సహోద్యోగి మరణించడంతో ఆ కుటుంబానికి స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు అండగా నిలిచి, ఆపన్నహస్తం అందించారు. బొడ్డవర గ్రామానికి చెందిన బి.పోలారావు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. యజమాని పోలారావు మరణంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.ఈ విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ కె.రమేష్ డిపో సిబ్బందిని సమావేశపరిచి మన వంతు సాయం అందిద్దామన్న ఆలోచన వారితో పంచుకున్నారు.ఆయనఆలోచనకు డిపో ఉద్యోగులంతా మద్దతు ఇచ్చి వారి శక్తి మేరకు ఆర్థికసాయం ప్రకటించారు. వీరికి తోడుగా బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ సిబ్బంది కొంతసాయం అందించారు. మొత్తం రూ.60,000 నగదును స్థానిక పోస్టాఫీస్‌లో ఇద్దరు కుమార్తెల పేరున ఫిక్స్ చేసిన బాండ్లను మృతుడు పోలారావు భార్య, కుమార్తెలకు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్ బుధవారం అందజేశారు. స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోలారావు కుటుంబీకులకు బాండ్‌లు అందజేస్తున్న డీఎం రమేష్, తదితరులు